**జీవితమంత విచిత్రమైనది అదే గాని మరొకటి లేదు. మేధావి అనేవాడు నిరంతర భావనా శీలీ, నిత్య ప్రయోగశాలీ అయి వుంటాడు. అలాంటి అతనికే లొంగిచావదు మాయ జీవితం! ఏ సిద్ధాంత చట్రానికీ దొరకదు. ఏ శాస్త్రీయ దృక్పథానికీ అందదు.**

# స్ట్రేంజ్ బెడ్ ఫెలోస్

## అవసరాల రామకృష్ణారావు

ఎలా వున్నది అలా స్వీకరిస్తే తప్ప మనిషికి మనశ్శాంతి వుండదేమో! అనుకుంటూ కల్యాణి ఇంటివైపు అడుగులు వేస్తూ నెమరు వేస్తున్నది. శిశువైద్య నిపుణుడు పి. శ్రీనివాస రావు ఎమ్మెస్. ప్రైవేట్ డిస్పెన్సరీ పెట్టుకుని జయప్రదంగా నిర్వహిస్తున్నాడు అతను.

సగటు మనిషి ఇంకా అజ్ఞాన రేఖని దాటడం లేదు. ఆధునిక జీవనం నేర్పుతున్న ధన దాహం శాస్త్రజ్ఞుణ్ణే నిలబడనివ్వడం లేదు. అందుకనే చాలా మంది డాక్టర్లు చిన్న స్కెర్లింగు సర్దుబాటుతో జబ్బుని డబ్బుగా మార్చుకుని సుబ్బరంగా బతుకుతున్నారు.

వాళ్ళందరికీ రావు మినహాయింపు.

తన డిస్పెన్సరీకి వెలవెలబోతూ వచ్చిన ప్రతి ఒక్కరూ కళకళలాడుతూ తిరిగి వెళ్ళాలని అతని ఆశయం. అందుకే అతని నిరంతర ప్రయత్నం. కాని ఎల్లవేళలా అతను అనుకున్నట్టు జరగడం లేదు! ఇంత పెద్ద వైద్య శాస్త్రమూ కొన్ని కొన్ని బాధలకు జవాబు చెప్పలేకపోతోంది. పిల్లలు లేని వాళ్ళ సరేసరి. అదసలు అతని విభాగం కానే కాదు. పుట్టిన పిల్లలందరూ రోజు రోజుకీ రాజ రాజులా ఎదగవద్దా? ఏ కారణమూ లేకుండా కొందరు ఎగిరి పోతూంటేతనెందుకు!

తల్లడిల్లిన ఏ తల్లి చూపులూ అతన్ని విలదియ్యక మానవు. నోటితో ఒక్కమాట అనకపోవచ్చు. ఆ రోజు ఆవిడ చూసిన చూపు అతను ఎలా మరచిపోగలడు!

ప్రతి నిముషం అవే చూపులు. ఆ చూపులు సూటిగా అడిగే ప్రశ్నలు; రక్తం పిండి సొమ్ము వసూలు చేసే డాక్టరు కాదు మీరు. మీ సహృదయత, సాటి బాధితులపైన మీ సానుభూతి నిజంగా చేయెత్తి మొక్కవలసినవే. అంత మాత్రంచేత మాకేం ఒరిగింది! నిజానికి మీరెంత అడిగినా ఇవ్వడానికి మేము సిద్ధంగానే వున్నాము. అదికాదు, ఎంతో ఆరోగ్యం వున్న మాకు పుట్టిన పిల్లలు ఎందుకు బతకరు? ఏమిటి మీ జవాబు? జవాబు చెప్పలేకపోతే మీరెందుకు?

ఇలాంటప్పుడే రావుని చెప్పలేని వైరాగ్యం క్రుంగదీస్తుంది. అలాంటి సందర్భాల్లోనే రిలీఫ్ కోరి అతను కల్యాణి దగ్గరకి వెళ్ళడం. ఆ ఇంటి మెట్లెక్కుతూంటే ఓ గేయం గుర్తొస్తుం దతనికి. అది వాళ్ల తాతాగారు అతని చిన్నప్పుడు చెప్పింది.

ప్రపంచమందున ప్రతీ చింతకీ
ప్రతిక్రియ అన్నది ఉందో, లేదో!
ఉంటే ఆ దిశ ఉరుకు వెంటనే
లేదూ, విధితో రాజీ అయిపో!

ప్రాక్టికాలిటీ మీద అంతకు మించిన మంచి వ్యాఖ్య లేకపోవచ్చు. కాని కనబడని దాన్తో ఎడ్జస్ట్ అయిపోతూ వుంటే ఇన్ని శాస్త్రాలు దేనికి!

కల్యాణి కాలేజీలో చేరిన మొదటి రోజుల్లో రావు క్లాసుమేటు. ఒకింటి వారి మౌదామని ఒకరంటే ఒకరు మనసుపడ్డారు మొదట్లో. కలిసి ఒకింటి వారు అవడం కన్నా విడిగా ఎవరి దిశలో ఎవరంతటి వాళ్లు వారవడం ముఖ్యమనే పరిణితికి చేరుకున్నారు. ఆ మందుల వాసన కళ్యాణికి పడదు. భాషా శాస్త్రం మీద ఆమె మోజు రావు సరిపెట్టుకోలేనిది. ఎవరి అభిరుచి శిఖరాలు వారు చేరుకుని, ఎవరి సంసారాలు వారు ఏర్పరచుకున్నారు. అయినా ఎదుటి అభిప్రాయాన్ని సానుభూతితో గౌరవించడం తెలిసిన సంస్కారులు వాళ్ళు. అందుకే మంచి స్నేహితులుగా మిగిలిపోయారు.

'ఏం హాయ్ శ్రీనూ, రా రా! అలా వేలాడేశావేం మొహం! నీ చేతి మీదుగా మరో ఖూనీ జరిగిపోయిందా యేం, ఇవాళ మీ ఆస్పత్రిలో!' అంటూ నవ్వుతూ ఆహ్వానించింది.

'అవును మరి, మీలా ప్రతినిత్యం భాషని ఖూనీ చెయ్యడం మాకు చేతకాదుగా' అంటూ రావు కుర్చీ ఆక్రమించాడు.

'ఈ రెండు రకాల హత్యలూ ఎక్కడ జరిగి పోతాయో అని దేవుడు మనల్ని విడదీశాడను కుంటాను శ్రీనూ. అయితేనేం, ఒక్కొక్కప్పుడు నా భాషా శాస్త్రానికీ, నీ వైద్య జ్ఞానానికి వింత దాంపత్యం తప్పేటట్టు లేదు సుమా!' అంటూ కాఫీ అందించింది ఆప్యాయంగా.

అదే కళ్యాణిలో ప్రత్యేకత. కెలికితే సున్నిత హృదయం వేదన పెరుగుతుందని ఆమెకు తెలుసు. అందుకే గుర్తించినా అదేమని అడగదు. తనే ఏవో చెప్పి మరలించి మరపిస్తుంది. ఆ మెట్లెక్కి ఏవారంగా కిందకి దిగడం రావు ఎరగనిది. అంతేకాదు. 'ఇలాంటి మనిషిని ఇల్లాలు చేసుకోలేక పోయానే' అని పొరపాటున కూడా అనుకోనివ్వదు. విధేయురాలైన భార్య ఎవరికైనా దొరుకుతుంది. మంచి స్నేహితురాలు మాత్రం రావు లాంటి అదృష్టవంతులకే!

'మీ యూనివర్సిటీ శిష్యులు ఇవాళ కూడా అల్లరి పెట్టారా ఏం?' అని అడిగాడు. కళ్యాణి తెలుగు రీడరుగా పనిచేస్తోంది.

'వాళ్ళ మొహం, వాళ్ళా నీలాంటి వాళ్ళా నన్ను అల్లరి పెట్టేదేమిటి! ఇవాళ ఆనర్స్ పిల్లలకి భారతంలో ఆది పర్వం చెబుతున్నానోయ్! శంతనుడి మాయదారి సంతాన ద్వయం లేదూ, ఆ పేర్లు వచ్చాయి' 'చాలా చిత్ర విచిత్రంగా వున్నాయి సుమండీ మేడమ్ ఈ పేర్లు' అంది ఓ అమ్మాయి. ఆ ప్రశ్న నన్ను వెంట బెట్టింది. ఇంటి కొచ్చి ఎన్నో బుక్స్ రిఫర్ చేశాను. 'అమ్మ వ్యాసుడా! ఎంతదేవాంతకుడివయ్యా నువ్వు' అనిపించింది. ఎలాగా నువ్వొ వచ్చావు కదా, అంతో ఇంతో మెడి(కల్) 'సిన్' చేసినవాడివి. నీ చెవిన వేస్తే సరదా పడతావు కదా' అంటూ , అతని అయోమయాన్ని మరింత పెంచి కిలకిల నవ్వింది కళ్యాణి. నవ్వుతూ చెప్పింది.

'శంతనుడి కొడుకుల పేర్లు చిత్రాంగదుడూ, విచిత్ర వీర్యుడు. మా స్టూడెంటు అడిగే దాకా నాకు తోచనే లేదు. ఈ పేర్లలో ఇంతటి జస్టిఫికేషన్ వుంటుందని. భారత వ్యాఖ్య రాసిన పెద్దలెవరైనా ఇలాంటి ఎక్స్ప్లనేషన్ను ఆమోదించారో లేదో వెరిఫై చేసి చూడాలి. ఈ ఇద్దరు పురుషులూ సంతాన ప్రాప్తికి అనర్హులు. వైద్యరీత్యా తక్కిన సూక్ష్మాంశాలు నాకంతగా తెలీవుగాని, పురుషుల్లో ఈ అశక్తతకి రెండు కారణాలు. మొదటిది అంగ సంబంధమైనది. స్తంభనలో ఇబ్బందులూ, ప్రీమెచూర్ ఎజాక్యులేషన్ లాంటివీను. ఇలాంటి స్ట్రేంజ్ క్వాలిటీస్ గల జననాంగం గలవాడిని చిత్రాంగదుడు అంటే తప్పేముంది. రెండో కొడుక్కి ఇలాంటి లోపం లేకపోవచ్చు గాని అతని వీర్యమే విచిత్రమైనది. ఎందుకంటే ఇలాంటి వాళ్ళ సెమనల్ ఫ్లూయిడ్లో స్పెరమ్టోజా అంటే జీవశక్తి ధాతువులే వుండవు! డిక్షనరీ ఒకటి చూశాను. ఇలాంటి లోపానికి ఏం పేరు అని. ఎజూర్ స్పెర్మియాట. కరెక్టేనా? అలాంటి లోపాయికారి 'లోపధారి'కి విచిత్ర వీర్యుణ్ణి మించిన పేరేముంది. యామ్ ఐ కరెక్ట్ శ్రీనూ?'

ఓరకంగా కళ్యాణి చేసిన డిస్కవరీని శ్రీను ఎంతగా మెచ్చుకున్నాడంటే ఆ ప్రశంసలో అతను దేనికోసం బాధ పడుతూ అక్కడికి వచ్చాడో అది ఇంచుమించు మరచే పోయాడు. వెళ్లిపోదామని లేచి నిలబడి ఇటు తిరిగినప్పుడు మాత్రం అతని మొహంలో తిరిగి నీలిమేఘాలు అలుముకోడం కళ్యాణి ఇట్టే పసిగట్టేసింది. చెయ్యి పట్టుకుని ఇటు తిప్పి కుర్చీలో కూలదోసింది. మరో కప్పు కాఫీ ఇచ్చి అతనికి వచ్చిన ప్రాబ్లమ్ ఏదో వల్లవల్లగా బయటికి లాగింది. అదీ ఇదీ: ఆ వచ్చిన వాళ్లిద్దరికీ పెళ్ళై నాలుగేళ్లయిందట. అతను


సబ్ కలెక్టర్. ఆవిడ ఎమ్మెస్సీ బయాలజీ యూనివర్సిటీ ఫస్టు. అతనికి ముప్ఫై రెండూ, ఆవిడకి ఇరవై ఎనిమిదీ. ఇద్దరూ పుష్టిగా సుష్టుగా దిష్టికొట్టేలా వున్నారు. ఏ పరీక్ష లోనూ ఎలాంటి చిన్న లోపమూ లేదు ఏ ఒక్కరిలో. పెళ్ళైన ఏడాదికే గుండుపిక్క లాంటి గుంటడు దిగాడు వాళ్ళకి. పంచ ప్రాణాలూ పెట్టి పెంచారు. పుట్టడం దుక్కలాగే పుట్టాడు గాని రోజు రోజుకీ నీరసం వాడికి. తల్లి పాలు చాలలేదేమో అని డబ్బాపాలు పట్టేరు. ఏం పట్టినా క్రుంగి కృశించి ఇంకా పదో నెల రాకుండానే చచ్చిపోయాడు. చావడానికి కారణం ఆహార లోపం అన్నారుట ఆ డాక్టర్లు. ఇంకో పిల్ల వెంటనే కడుపున పడింది. వాళ్ళు బాగా వున్న వాళ్ళు. ఈ సారి మొదట్నుంచీ మరీ జాగ్రత్తగా వున్నారు. నెల నెలా గర్భవతికి అన్ని రకాల పరీక్షలూ. సుళువుగా పురుడొచ్చింది. పుట్టినప్పుడు ఇదీ కుదిమట్టంగా కడు దిట్టంగా పుట్టింది. ఈ భూమ్మీద పడ్డాకే ఎక్కళ్ళేని బాధలూ. ఏడాదిన్నర బతికిందట. ఇప్పుడూ అన్నలాగే రోజు రోజుకీ చిక్కిపోవడమే. తన పాలు అచ్చి రాలేదేమో అని తల్లి, దాసీ దాని పాలు ఇప్పించేదిట. అవీ పడకపోతే ఆవుపాలు. అవీ అరిగించుకోలేకపోతే ఎవరో చెప్పారని లేడి పాలు కూడా తెప్పించి పట్టేందిట! ఏం లాభం? ఆ పిల్లకి ఏదీ ఇముడకపోగా ఆఖరాఖరికి పిచ్చిదాన్లా తయారయిందిట. పోయే రెణ్ణెల్ల ముందు కంటి చూపు కూడా దెబ్బతిందిట. ఈ సారి ఆ పాప ఎందుకు పోయిందో డాక్టర్లు సరిగ్గా నిర్ధారణ చెయ్యలేక పోయారట.

'ఎప్పుడో ఏదో పాపం చేసి వుంటాం. ఆ పాపాన్ని నోరెరగని మన పాపలకి పంచి పెడుతున్నాం. వాళ్ళ బాధ చూడలేకుండా వున్నాం. ఇక మనకి సంతానం వద్దు. ఋణం తీరిపోయింది' అని మొగుడు అంటూంటే ఆవిడ బలవంతాన నోరు మూసిందట అని రావు చెప్పబోతూంటే కళ్యాణి ఆపు చేస్తూ అంది.

'శ్రీనూ, ఎవరామాట అన్నా 'ఋణం తీరిపోయింది' అనే మాట వింటూంటే ఓ చిన్న కథ గుర్తు కొస్తుంది నాకు. ఓ తెలికులి వాడికి ఓ పెద్ద మనిషి వీశ నూనెకి డబ్బు బాకీ పడ్డాడట. ఆ బాకీ తీర్చలేదు ఇంకా ఆ పెద్ద మనిషి. ఇంతట్లో ఆ తెలికులి వాడు చచ్చిపోయాడట. చచ్చి ఆ పెద్ద మనిషికి కొడుకై పుట్టాడట. ఆ పెద్ద మనిషి రోజూ ఆ కొడుక్కి స్వయంగా నూనె రాసి నీళ్ళు పోసే వాడట. ఈ వీశెనూనె ఆ పసికందు వంటికి ఇంకడం ఏ క్షణాన పూర్తయిందో, సరిగ్గా ఆ గడియలో కుర్రాడు గుటుక్కు మన్నాడట. తనకి రావలసిన బాకీ ఈ విధంగా వసూలు చేసుకున్నాడుగా తెలికుల తిలకుడు. ఋణం తీరి పోయిందిగా, వచ్చిన పని అయిపోయిందిగా, అందుకూ! సరేలే కట్టు కథలంత సిల్లీగా వుండవు కదా జీవితాలు. మీ పిల్లల తల్లి ఒప్పుకుని వుండదు. మరో ఛాన్సు, ఆఖరి ఛాన్సు చూద్దామనుకుని వుంటుంది. కడుపులో వుండి వుంటుంది. పిల్లల వైద్యంలో నైపుణ్యం ఒక్కటే కాక మానవ జీవితంపట్ల నీకున్న ప్రగాఢమైన వాత్సల్యం ఆమె దాకా వెళ్ళి వుంటుంది. నిన్ను చూసి వుంటుంది. అవునా?''

తల వూపుతూ కళ్యాణి రెండు చేతులూ పట్టుకున్నాడు రావు. 'మీ మీద అంచంచల విశ్వాసంతో ఇంత దూరం వచ్చాను. జవాబు చెప్పండి. నా కడుపున పుట్టిన పిల్లలు ఎందుకు బతకరు. నాకేం పాలు పోవడం లేదు డాక్టర్!' అని పదే పదే అంటున్న ఆ గర్భిణి దుర్భర వేదన తన మనసుని కలచి వేస్తోందని చెప్పుకున్నాడు.

ఆ మాటలలో ఏం తోచిందో ఇటు తిరిగి 'ఏదేదీ, ఆ ఆఖరి మాట, ఆవిడన్నది మరోసారి చెప్పు' అంది. 'అందులో విశేషం ఏముంది, నాకేం పాలు పోవడం లేదు డాక్టర్' అని



కాబోలు గోలపెట్టింది - ఏం? 'ఏం లేదు. నేను చెప్పింది సిల్లీగానే వుండొచ్చు. మా అమ్మమ్మ మా చిన్నప్పుడు చెబుతూ వుండేది. వాళ్ళ దొడ్డమ్మకో ఎవరికో నాకు సరిగ్గా గుర్తు లేదు. ఆ రోజుల్లో ఈ బేబీ ఫుడ్స్ లేవు. ఎక్కడో ఒకటో అరా వున్నా ఆచారం వల్లో భయం వల్లో పట్టనిచ్చే వారు కారుట. ఆ దొడ్డమ్మ గారికి ఏటా సంతానం. బాగా తప్పకుండా పాలు వుండేవిట ఆవిడకి. పుట్టిన ప్రతిపిల్లా రాత్రీ పగలూ కేరు కేరని ఒకటే ఏడుపులు. ఆ దిక్కుమాలిన రోజుల్లో నిస్సహాయురాలైన ఆ తల్లి, అవకాశం ఇవ్వలేదు గాని, నాకేం పాలు పడడం లేదు డాక్టర్!' అని ఎందరితో మొరపెట్టుకునేదో! ఇప్పుడు విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. మునుపటికన్న అన్ని అవకాశాలూ పెరిగాయి. ఇది గాక నువ్వు చెప్పిన తల్లి దండ్రులు బాగా చదువుకున్న వాళ్లు. ఎంతో డబ్బున్న వాళ్లు. పెద్ద నగరంలో అన్ని సదుపాయాలు వున్న ఆసుపత్రులు వున్న వాళ్లు. అయినా మన విజ్ఞానం 'నాకేం పాలుపోవడం లేదు' అనేస్థితిలోనే ఇంకావుందంటే...



హఠాత్తుగా శ్రీనుత్తుళ్ళి పడినట్టు ఇటు తిరిగాడు. చీకటిలో వున్న వాడి మొహాన సూర్యకిరణం పడినట్టయింది ఆ మాట చెవిన పడగానే. 'అదే మాట ... నువ్వు మళ్లీ మళ్లీ అంటూంటే కొత్త అర్థం తోచినట్టవుతోంది. 'పాలుపోవడం లేదు' అని కదా! ఆ తల్లి తల్లడిల్లి పోయింది తన పాలు ఇచ్చింది. మిల్క్ ఫుడ్స్ ట్రై చేసింది. అనేక జంతువుల పాలు కూడా ప్రయత్నించింది. పాలు 'పోవడం' లేదు. ఎవరికి? తల్లికి కాదు పిల్లకి. ఎక్కడికి? గొంతులోకి దిగి జీర్ణకోశం లోకి. ఇన్నాళ్లు ఇందరు పిల్లలకి వైద్యం చేసినా ఇంకా ఎంత వెనకబడి వున్నాము మేము. పాపం ఆ తల్లి పాపలకి ఏ రకం పాలూ అరాయించుకోలేని అవస్థ ఏమో! ఇది బాగా రేర్ గాని, బొత్తిగా లేంది మాత్రం కాదు. ఇంకా నీతో కూచుని కబుర్లు చెప్పడానికి నాకిప్పుడు టైము లేదు. తర్వాత చెబుతాను.'

సెమినార్ లైబ్రరీలో శ్రీనివాస రావు తను వెదుకుతున్న ఇన్ఫర్మేషన్ బయటపడే దాకా ఇవతల పడలేదు. అతి అరుదుగా పిల్లలకి వచ్చే రోగం అది. 'గాలెక్టో సెమియా' అంటారు దాన్ని. ఏ పది లక్షల్లోనో ఒక శిశువుకి పుట్టుకతో వచ్చే రోగం ఇది. ఏ పాలల్లో అయినా గాలెక్టోజ్ అనే సుగర్ వుంటుంది. ఆ రోగం వున్న పిల్లలకి ఏ రకం పాలూ పడవు. ఏ పాలు అయినా వాళ్ల పాలిటి విషం. వాటితో వాళ్లు బతక లేరు. బతికితే కంటి చూపు గాని, లివరు గాని దెబ్బతిని రెండు మూడేళ్లలో మృత్యు ముఖం పడడం ఖాయం.

అయితే ఆ వచ్చినావిడ పిల్లలకి అదే లోపం అని ఎవరు రుజువు చేస్తారు? ఆ పరీక్షల్లో నిపుణుల చేత ఆవిడ రక్త పరీక్ష చేయిస్తే ఆ సూచనలు వున్నాయి గాని నిర్ధారణగా రుజువు కాలేదు రావుకి. అతని సలహా మేరకి ఆవిడ ఆ డిండెలివరీ పురుడు పోసుకుంది. ఇలా బిడ్డ భూమ్మీద పడడమేమిటి, కోసిన బొడ్డు నుంచి రక్తం తీసి బిడ్డ రక్త పరీక్షకి పంపడం జరిగింది. ఆ రక్త పరీక్ష ఫలితం రావు సందేహాన్ని స్థిరీకరించింది.

ఇలాంటి రోగానికి మందేమిటి? మిల్క్ ఫ్రీ డయట్‌తో శిశువుని పెంచడమే. ఆరోగ్యంగా ఎదుగుతున్న ఆ పిల్లాణ్ణి చూసుకున్న ఆ తలిదండ్రుల ఆనందం కన్నా రావు లాంటి డాక్టర్లకి పెద్ద ఫీజు ఎక్కడుంది.

'చూశావా, ఏదో మామూలు పేర్లు పెట్టుకుని నేనానాడు చిత్రం, విచిత్రం అంటే కొట్టి పారేశావ్?' అంటుంది కళ్యాణి.

'అమ్మమ్మ, ఎంత మాట! నీ భాషా వైదుష్యంలోంచే కదా ఈ కొత్త విచిత్రం వెలుగులా కొట్టుకొచ్చింది' అని నవ్వుతూ జవాబు చెబుతాడు శ్రీనివాసరావు.



బ్రాంచి: పూర్ణామార్కెట్, విశాఖపట్నం -1